వీధి కుక్కల్లో వైరస్..జనంలో టెర్రర్

పెనుగొండ: అసలే కుక్కల బెడదతో బెంబేలెత్తి పోతున్న ప్రజలకు ఇటీవల కాలంలో కుక్కల్లో పెరిగి పోతున్న వైరస్ భయాందోళనకు గురిచేస్తుంది.కుక్క కాటు కన్నా వాటికున్న వైరస్‌తో ఎపుడు ఏ వ్యాధి సంక్రమిస్తుందో తెలియక ఆందోళనకు గురువతున్నారు. గత కొంత కాలంగా వైరస్ వ్యాప్తితో చర్మవ్యాధులు ప్రబలిపోతుండడంతో వాటి శరీరం పై పుండ్లు పడి రక్తం, చీము స్రావం జరుగుతూ భయపడే విధంగా తయారవుతుండడంతో చూడడానికే హడలి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వీటి కాటుకు గురైతే రేబీస్‌కు తోడు, ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందంటూ విపరీతమై ఆందోళనకు గురవుతున్నారు.

పెరిగిన కుక్కల సంఖ్య

కుక్కలు సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో గ్రామాల్లో కూడళ్ల రాత్రి వేళయితే చాలు వాటితో నిండిపోతున్నాయి. ఇటీవల కాలంలో కుక్కలను పట్టుకోవడం వల్ల చట్ట ప్రకారం ఇబ్బందులకు గురి కావాల్సి రావడంతో పంచాయతీ అధికారులు కుక్కలను వేటాడడం విరమించుకున్నారు. దీంతో వీటి సంఖ్య నానాటికి పెరుగుతూ వస్తుంది. కుక్కలను పట్టుకొన్నా ఇతర గ్రామాల పొలిమేరల్లో వదలి వేసి వస్తున్నారు. దీంతో పక్క గ్రామాల్లో అవి తిష్ట వేస్తున్నాయి. దీనికి తోడు రాత్రి వేళల్లో గుంపుగుంపులుగా చేరి దాడులు చేసుకుంటుండడంతో కుక్కల అరుపులతో ప్రజలు హడలిపోతున్నారు. అధికారులకు కుక్కలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలను బయటకు పంపాలంటే భయపడుతున్నామని వాపోతున్నారు.


వైరస్ సోకిన కుక్క

వదలిలో వ్యాక్సినేషన్

గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు పెనుగొండ మండలం వదలి పంచాయతీలో రేబీస్ వ్యాధి సోకకుండా కుక్కల పట్టుకుని వ్యాక్సినేషన్ చేయడం ప్రారంభించారు. వ్యాక్సిన్‌వేయడం వల్ల రేబీస్ నివారణతో పాటు, చర్మ వ్యాధులు సంక్రమించకుండా నివారిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇదే వ్యాక్సిన్ ఇతర గ్రామాల్లోని కుక్కలకు వేసి వైరస్ నివారణ చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.


వదలిలో కుక్కలకు వ్యాక్సిన్ వేయిస్తున్న పంచాయతీ అధికారులు

వైరస్‌తో బీభత్సం



కుక్కలకు సోకుతున్న వైరస్‌తో కుక్కలు వికృతంగా తయారై బీభత్సంగా ఉంటున్నాయి. దీంతో వాటిని చూసే సరికే వణుకుపుడుతుంది. కరవడం ఎలా ఉన్నా వీటికి సమీపంలోకి వెళితే చాలు వ్యాధులు సోకే అవకాశం ఉండడంతో భయపడాల్సి వస్తుంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాలి.

– ఎస్ బాబ్జీ, పెనుగొండ

రాత్రిళ్లు బయటకు వెళ్లాలంటే భయం



రాత్రయితే చాలు కుక్కలన్నీ వీధుల్లోకి చేరి భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. పదుల సంఖ్యలో రోడ్డు పైకి చేరి వాహనాలపై వచ్చేవారిపై దాడులు చేస్తున్నాయి. దీంతో తీవ్రంగా గాయపడుతున్నారు. చిన్నారులు నడిచి వెళ్తూ ఏమాత్రం భయపడి పరిగెట్టినా వెనుక తరిమితరిమి కరుస్తున్నాయి.

– టి.ప్రసాద్, పెనుగొండ

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు బోస్ కుటుంబానికి పరామర్శ


సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముదునూరి ప్రసాదరాజు

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామ మాజీ సర్పంచ్ జక్కంశెట్టి భాగ్యలక్ష్మి భర్త, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జక్కంశెట్టి సుభాష్‌చంద్రబోస్ ఇటీవల వయోభారంతో మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆదివారం కొంతేరు వచ్చి భాగ్యలక్ష్మిని, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రసాదరాజుతో పాటు పార్టీ నాయకులు పెచ్చెట్టి కృష్ణాజీ, వీరా ఉమాశంకర్, పోలుకొండ ఏలియా భక్తసింగ్, కుక్కల రామకృష్ణ, లంక చిరంజీవి, సిర్రా నాగరాజు, పితాని శ్రీనివాస్, కాటం శేఖర్, ఉన్నమట్ల లక్ష్మణ్ బోస్ కుటుంబాన్ని పరామర్శించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

యలమంచిలి: మండలంలోని చింతదిబ్బ, ఇలపకుర్రు, అబ్బిరాజుపాలెం, లక్ష్మీపాలెం, యలమంచిలిలంక గ్రామాల్లో రూ. 1.50 కోట్లతో చేస్తున్న వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు సమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సర్పంచ్‌లు చిలుకూరి సూనావతి, కొండేటి జీవరత్నం, కామిశెట్టి సాయిబాబు, గటిగంటి మహేష్, వల్లభు సాయి వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు


సిద్ధాంతం నక్కా వారి పాలెంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం నక్కావారి పాలెంలో మావుళ్లమ్మ జాతర మహోత్సవం సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో అమ్మవారి ప్రతి రూపాలు, పల్లెటూరి అందాలు, సంక్రాంతి సందళ్లు, సనాతన ధర్మ విశిష్టత ప్రతిబింబించే విధంగా మహిళలు ముగ్గులు వేశారు. ఈ నేపథ్యంలో జాతరకు వచ్చిన భక్తులు ముగ్గులను చూసేందుకు ఉత్సాహం చూపారు.

ముగిసిన గరగాలమ్మ జాతర


సిద్ధాంతం గరగాలమ్మ దిబ్బలో అన్న ప్రసాదాన్ని తింటున్న భక్తులు

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం గరగాలమ్మ దిబ్బలో గరగాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధన విందు భోజనాన్ని తలపించే విధంగా ఏర్పాటు చేయడతో సుమారు 3 వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ముగిసిన సప్తాహ మహోత్సవాలు


సప్తాహ మహోత్సవాల్లో కచేరీ నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని సీతారాంపురంనార్త్ పంచాయతీలోని పట్టాభి రామాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న సప్తాహ మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి పూర్ణాహుతి, సామ్రాజ్య పట్టాభిషేకం, శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు పూర్ణాహుతి హోమంలో పాల్గొని ప్రత్యేపూజలు చేశారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. సోమవారం ఉదయం అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

అక్షయపాత్ర ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ


వదలిలో ఆహారం పంపిణీ చేస్తున్న అక్షయ పాత్ర సభ్యులు

పెనుగొండ: మండలంలోని వదలిలో అక్షయ పాత్ర ఆధ్వర్యంలో ఆదివారం ఆహారం పంపిణీ చేశారు. పెనుగొండలో కూనపరెడ్డి రాజు ఇంటిలో జరిగిన కార్యక్రమంలో మిగిలిన ఆహారం ఉండడంతో వారు అక్షయ పాత్ర సభ్యులు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన అక్షయ పాత్ర సభ్యుడు వాటిని వదలి తీసుకెళ్లి పేదలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర సభ్యులు ఉప్పలపాటి చంటి, చింతా త్రిమూర్తులు, అత్యం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

పాలకొల్లు అర్బన్: పట్టణ పరిధిలోని బెల్ట్‌షాపు ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న జె.ముసలయ్యనాయుడిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. నిందితుడి దగ్గర నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సైలు పి.మహేష్, జి.రఘు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బుర్రకథ

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ అమ్మవారి 61వ వార్షిక మహోత్సవాల్లో ఆదివారం రాత్రి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలో శ్రీలక్ష్మీ గణపతి బృందం దేవిశ్రీ పార్టీ విజయనగరం వారు ప్రదర్శించిన వెరైటీ బుర్రకథ ప్రేక్షకులను అలరించింది. అనంతరం భస్మాసుర నాటకం ఎంతో ఆకట్టుకుంది.

వయోజనులు జాతీయ సంపద


వేదికపై సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి

పాలకొల్లు అర్బన్: వయోజనులు జాతీయ సంపదలాంటివారని, వారిని గౌరవంగా సాకాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందని సీనియర్ సిటిజన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి అన్నారు. పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో క్షీరపురి సీనియర్ సిటిజన్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సూపర్ సీనియర్ సిటిజన్స్ సత్కార సభ నిర్వహించారు. దీనిలో భాగంగా మాజీ ఎంపీ చేగొండి హరరామజోగయ్య, మాజీ ఎమ్మెల్యేలు అల్లు వెంకట సత్యనారాయణ, డా.సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి)లను మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా సత్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్, రిటైర్డు హైస్కూల్ హెచ్ఎం ఎస్‌డీ పాలేశ్వరి శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేసి ఆహుతలను అలరించారు. అలాగే సీనియర్ సిటిజన్ ఇనుముల వెంకటేశ్వరరావు సామ్రాట్ అశోక్ ఏకపాత్రాభినయం చేశారు. రిటైర్డు ప్రిన్సిపాల్ సీవీవీ సత్యనారాయణమూర్తి, రిటైర్డు బ్యాంక్ ఉద్యోగి వీఎస్ఎన్ మూర్తి, పాలకొల్లు గద్దర్ అంబటి రాజు, వంగా శేషారావు, కేఎస్‌వీడీ ప్రసాద్, చాంబర్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహారావు, సంఘ గౌరవాధ్యక్షుడు వేగేశ్న వెంకటపతిరాజు, సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వంగా నరసింహారావు, గుబ్బల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కార్యకర్తలను వేధిస్తే సహించం

పాలకొల్లు అర్బన్: అధికార దాహంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తే సహించేది లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హెచ్చరించారు. పాలకొల్లు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంగా నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను వేధిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాల్లో చిన్న ఫ్లెక్సీ గొడవను సాకుగా తీసుకుని పోలీస్ స్టేషన్లకు పిలిపించి వేధింపులకు గురి చేస్తున్నారని, ఇదంతా మంత్రి నిమ్మల కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపించారు. అధికారం శాశ్వతం కాదని, ఇదే వైఖరి కొనసాగితే భవిష్యత్తులో రోడ్డెక్కి ధర్నాలు చేస్తామని హెచ్చరించారు.


విలేకరులతో మాట్లాడుతున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

ఇన్‌చార్జ్‌ని మార్చే ఆలోచన లేదు...

పాలకొల్లు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ని మార్చే ఆలోచన లేదని తానే కొనసాగుతున్నట్లు గుడాల గోపి స్పష్టం చేశారు. పాలకొల్లులో కొంత మంది తనను ఇన్‌చార్జ్‌గా తప్పిస్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, చెన్ను విజయ్, గంటా నరేష్, జోగి వెంకటేశ్వరరావు, గంగిరెడ్ల ప్రసాద్, పాలపర్తి కృపానాథ్, పాలపర్తి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పోటీల నిర్వహణ అభినందనీయం


ఆర్డీఓ దాసి రాజుతో గొంది గ్రామ విన్నింగ్ టీమ్

నరసాపురం: పండుగ రోజుల్లో గ్రామాల్లో క్రీడా పోటీలు జరుపుకోవడం అభినందనీయమని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అన్నారు. నరసాపురం మండలం గొంది గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీఓ రాజు మాట్లాడుతూ యువత పండుగ రోజుల్లో జూదాలు, కోడిపందాలు వంటి విష సంస్కృతుల జోలికి పోకుండా ఉండాలంటే ఇలాంటి క్రీడలను ప్రోత్సహించాలని చెప్పారు. టోర్నమెంట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన గొంది గ్రామ జట్టుకు రూ.15 వేలు, షీల్డ్, రెండో స్థానంలో నిలిచిన పాతనవరసపురం గ్రామ జట్టుకు రూ.10 వేలు, మూడో స్థానంలో నిలిచిన అడవిపాలెం జట్టుకు రూ.5 వేల నగదు బహుమతిని ఆర్డీఓ చేతుల మీదుగా అందించారు. టోర్నమెంట్ నిర్వహణకు ఆర్థికంగా సహకరించిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో గుబ్బల వేణు, సర్పంచ్‌లు మద్దాల శ్రీకృష్ణాంజనేయులు, పెదపాటి శాంతరాజు, దేవ చింతయ్య, మద్దాల నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

పట్టించుకోని పంచాయతీ అధికారులు


వద్దిపర్రులో ఊరచెరువు వద్ద ఆర్అండ్‌బీ రహదారి పక్కనే చెత్తకుప్ప

పోడూరు: మండలంలో పలు గ్రామాల్లో రహదారులు, కాలువగట్ల పక్కనే చెత్త, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కొన్నిచోట్ల రోడ్డు మార్జిన్ వరకు చెత్తకుప్పలు ఉండడంతో పాదచారులు, ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల రోడ్లపక్కన ఉన్న చెత్తకుప్పల వద్దే కుక్కలు, పిల్లులు వంటి జంతు కళేబరాలను కూడా పారవేస్తుండడంతో రోడ్లపై ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రధానకాలువలు, డ్రెయిన్ గట్ల వెంబడి కూడా చెత్త నిల్వలు పోగవుతున్నాయి. ముఖ్యంగా గ్రామాలకు ప్రధాన తాగునీటి వనరులుగా ఉన్న పంటకాలువల పక్కన సైతం చెత్త, వ్యర్థాల నిల్వలు ఉండడంతో గ్రామాల్లో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరిస్థితి ఇదీ

పోడూరు మండల పరిధిలో జిన్నూరు గ్రామం నుంచి వేడంగి, కవిటం జగన్నాథపురం గ్రామాల మీదుగా పాలకొల్లు-మార్టేరు స్టేట్ హైవే ఉంటుంది. అలాగే ఆయా గ్రామాల మీదుగా ఇదే మార్గంలో నరసాపురం ప్రధాన కాలువ ఉంది. అలాగే జగన్నాథపురం నుంచి పోడూరు, గుమ్మలూరు గ్రామాల మీదుగా రావిపాడు వరకు చించినాడ పంట కాలువ ఉంది. వీటితో పాటు మండల పరిధిలో కాజ డ్రెయిన్, భగ్గేశ్వరం డ్రెయిన్, మొగల్తూరు డ్రెయిన్, నక్కల కాలువ వంటి ప్రధాన మురుగుకాలువలు ఉన్నాయి. ఈ కాలువ గట్లు చెత్తతో నిండి ఉన్నాయి. అలాగే పాలకొల్లు-పెనుమదం, కవిటం-కొమ్ముచిక్కాల, కవిటం-పైడావ, పోడూరు-మినిమించిలిపాడు, పోడూరు-పండితవిల్లూరు, పండితవిల్లూరు-తూర్పుపాలెం, గుమ్మలూరు-వద్దిపర్రు గ్రామాల మీదుగా ఆర్అండ్‌బి రహదారులు ఉన్నాయి. ఇవే కాకుండా జెడ్పీ రోడ్లు, గ్రామాల మీదుగా ప్రధాన రోడ్ల మార్జిన్స్‌లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి.


రావిగొప్ప శివారులో ఆర్అండ్‌బీ రహదారి పక్కన పోగుపడిన చెత్తకుప్ప


బందారువారిచెరువు వద్ద చించినాడ పంట కాలువ గట్టుపై చెత్తకుప్పలు

డంపింగ్ యార్డులకు తరలించాలి

గతంలో డంపింగ్ యార్డులు లేనపుడు చాలాగ్రామాల్లో రోడ్లపక్కల చెత్తనిల్వలు ఉండేవి. ఇప్పుడు దాదాపు అన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. దీంతో రోడ్లపక్కన పోగుపడే చెత్త నిల్వలను కనీసం రెండు, మూడు రోజులకు ఒకసారైనా డంప్‌యార్డులకు తరలించడం ద్వారా ఇటువంటి పరిస్థితికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే రోడ్లపక్కన, పంట కాలువల పక్కన చెత్తపోగులు వేయకుండా ప్రత్యేకించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి చెత్తనిల్వలు పోగవకుండా నివారించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సీతారాంపురంలో 51 ఏళ్ల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు

నరసాపురం రూరల్: సీతారాంపురం నార్త్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 51 ఏళ్ల అనంతరం వారంతా ఒకచోట కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ చిరకాల స్నేహానికి గుర్తుగా కేక్‌ను కట్ చేసుకుని వేడుక చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చిన మిల్లి వెంకట్రావు, గంగిపాముల కాంతాజీ, వర్ధినీడి సత్యనారాయణ, మద్దాల వెంకటేశ్వరరావు, సిర్రా జర్మయ్య, యడ్లపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బస్ స్టాప్‌ల నిర్మాణానికి స్థల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన డిజైన్లను త్వరితగతిన పూర్తి చేసి అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద, ఆర్టీసీ డిపో వద్ద, బస్ స్టాప్‌ల నిర్మాణాలకు స్థలాలను పరిశీలించారు. వీటికి సంబంధించిన డిజైన్లను రూపొందించి రానున్న రెండు రోజుల్లో అందజేయాలని మున్సిపల్ సర్వేయర్లను ఆదేశించారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా బస్టాప్ నిర్మాణ వ్యయాన్ని భీమవరం హాస్పిటల్స్ యాజమాన్యం, ఆర్టీసీ డిపో వద్ద బస్ స్టాప్ నిర్మాణానికి ఐఎంఏ నుంచి నిధులను సమకూరుస్తామని తెలిపారు. అనంతరం హౌసింగ్ బోర్డ్‌లోని కళావేదిక పార్కు అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇప్పటికే రూ.10 లక్షల వ్యయాన్ని పార్కు అభివృద్ధికి రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఖర్చు చేసిందని తెలిపారు. ఓల్డ్ బస్టాండ్ పునఃనిర్మాణానికి వెంటనే డిజైన్‌లను రూపొందించి నిర్మాణ దాతకు అందజేయాలని భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్‌ను ఆదేశించారు.


బస్ డిపో వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

వైభవంగా నాగారమ్మ జాతర ఉత్సవాలు



నరసాపురం: పట్టణంలోని 31వవార్డు చినమామిడిపల్లిలో ఉన్న శ్రీ నాగారమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి అమ్మవారి సంబరం వైభవంగా నిర్వహించారు. బాణసంచా కాల్పులు, బుట్ట బొమ్మల ప్రదర్శనలు, వివిధ వినోద కార్యక్రమాలతో ఉత్సాహంగా సంబరం చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం రాత్రి అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 26న అన్నసమారాధన ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

తెలుగు గొప్పతనాన్ని చాటి చెప్పిన మహనీయుడు వేమన

అత్తిలి: ప్రజాకవి శ్రీయోగివేమన తన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలిపి, తెలుగుభాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని ఆరవల్లి గ్రామంలో శ్రీయోగివేమన శత జయంత్యుత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన బహుమతి ప్రధానోత్సవ సభకు పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వేమన పద్యాలను ముందుతరాల వారు చదివేలా ప్రోత్సహించాలన్నారు. వంద సంవత్సరాలుగా వేమన ఉత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సినీ నిర్మాత కొవ్వూరి అచ్చిరెడ్డి, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తదితరులతో కలిసి మహిళా కబడ్డీ పోటీల్లో మొదటి ఐదు స్థానాలు సాధించిన ఉండి, జంగారెడ్డిగూడెం, అనంతపల్లి, పీఎం లంక, తణుకు జట్లకు, వాలీబాల్ పోటీలలో మొదటి మూడు స్థానాలు సాధించిన కొణితివాడ, జల్లికాకినాడ, ఆరవల్లి జట్లకు, ముగ్గుల పోటీలకు విజేతలకు బహుమతులు అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భీమవరం: టూటౌన్ పరిధిలో నల్లంవారితోట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గునుపూడికి చెందిన పాకెర్ల చిన్నయ్య గాయపడినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ చెప్పారు. చిన్నయ్య నడిచి వస్తుండగా వ్యాన్ ఢీ కొట్టిందని, భీమవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.